# తెలంగాణకు కొత్తగా మద్యం బ్రాండ్లు




**దశ, హైదరాబాద్:** ప్రపంచంలో కొన్ని వేల రకాల మద్యం బ్రాండ్లు ఉన్నాయి. కానీ, మందుబాబులు ఎక్కువగా తాగేది బీరే. కొంతమంది కొత్త వెరైటీలు టేస్ట్ చేస్తారు. తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని మద్యం బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కొత్త బ్రాండ్లు, విదేశీ బ్రాండ్లు కావాలని చాలా మంది కొరుకుంటుంటారు. అయితే, వారి కోరిక ఫలించేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొత్త బ్రాండ్లకు అనుమతి ఇవ్వాలని డిసైడ్ అయింది. రాష్ట్రంలో త్వరలో నూతన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ మేరకు గతంలో ప్రభుత్వం చేసిన కసరత్తు తర్వాత పెద్ద ఎత్తున విమర్శలు రాగా.. ఆ ప్రక్రియను తాత్కాలికంగా ప్రభుత్వం విరమించుకున్నది. అయితే, ప్రభుత్వం తాజాగా బడ్జెట్లో రాబడి అంచనాలను పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై ఆరా తీయడంతో ఈ నిర్ణయం అమలు చేయనుందని తెలుస్తోందితెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 1,956 బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తే మరో 604 మద్యం బ్రాండ్లు రాష్ట్రంలోకి అడుగుపెట్టేందుకు ఎదురుచూస్తున్నాయి. వీటి అనుమతి కోసం సుమారు 92 కంపెనీలు ఉండగా.. ఇందులో బ్లెండర్స్ ప్రైడ్, రాయల్ ఛాలెంజ్, సులావైన్ వంటివి ఇక్కడ ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్లు ఉన్నాయి. కొత్తగా రాబోతున్న వాటిలో 15 విదేశీ బ్రాండ్లు, 15 దేశీయ లిక్కర్, 7 బీర్ బ్రాండ్లు, 37 కొత్త బ్రాండ్లు ఉన్నాయని తెలుస్తోంది.ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులకు భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) పట్టుబడింది. ఆ మద్యం సీసాల్లో లోకల్ బ్రాండ్లు లేకపోవడం, విదేశీ బ్రాండ్ మద్యం అక్రమ తరలింపు గుర్తించారు. ఈ ఎన్డీపీఎల్‌లో అత్యధికశాతం మన దగ్గర అందుబాటులో లేని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ఉంటున్నాయని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం దగ్గర పెండింగ్‌లో ఉన్న బ్రాండ్లకు అనుమతి లభిస్తే ఈ ఎన్డీపీఎల్ సమస్య తగ్గుతుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు.కొత్తవాటికి అనుమతిస్తే.. ఒక్కో బ్రాండు రూ.15 వేల చొప్పున అనుమతి ఫీజును వసూలు చేయనున్నారు. తద్వారా రూ.90,45,000లు ప్రభుత్వానికి రాబడి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొన్ని వివాదాస్పద మద్యం కంపెనీలకు అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమైంది. అప్పటికే సదరు కంపెనీల నేపథ్యం వివాదాస్పదంగా ఉండటం, కొన్నిచోట్ల అవి కల్తీ మద్యం విక్రయించాయని తేలడంతో ప్రభుత్వం వాటితో ఒప్పందాలు రద్దు చేసుకున్నది. ఈ క్రమంలో అప్రమత్తమైన ఎక్సైజ్శాఖ వివాదాస్పద కంపెనీలను పక్కనపెట్టిన విషయం తెలిసిందే.అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అయిపోయాక.. కొత్త బ్రాండ్లకు గేట్లు తెరవాలని సర్కార్ ప్లాన్ చేస్తోంది. అంటే.. మార్చి లేదా ఏప్రిల్‌లో కొత్త మద్యం బ్రాండ్లు క్యూ కట్టే ఛాన్స్ ఉంది. ఇక అప్పుడు చూడాలి.. మందుబాబుల ఆనందం మామూలుగా ఉండదు.

# ఏప్రిల్ లో తెలంగాణ జాగృతి

## 'తెలంగాణ జాగృతి'ని పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే ప్రక్రియ తుది దశకు..

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరగబోతోంది. గత కొంతకాలంగా మౌనంగా ఉంటూనే తన వ్యూహాలకు పదును పెట్టిన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సరికొత్త రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. తన స్వచ్ఛంద సంస్థ 'తెలంగాణ జాగృతి'ని పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. వచ్చే ఏప్రిల్ నెలాఖరులో లేదా మే మొదటి వారంలో ఈ నూతన పార్టీ అధికారికంగా ప్రజల ముందుకు రానుంది. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే అన్ని సాంకేతిక, చట్టపరమైన చర్యలను కవిత బృందం పూర్తి చేసింది. గత నెలలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి అవసరమైన అన్ని పత్రాలతో కూడిన దరఖాస్తును అందజేశారు. ఈసీఐ నిబంధనల ప్రకారం పార్టీ పేరు నమోదు, ఇతర వివరాల పరిశీలనకు సాధారణంగా రెండు నెలల సమయం



పడుతుంది. అన్నీ సవ్యంగా సాగితే, ఉగాది పర్వదినం తర్వాత, ఏప్రిల్ ఆఖరి వారంలో ఒక మంచి ముహూర్తాన్ని చూసుకుని కవిత తన పార్టీ జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. భారత రాష్ట్ర సమితి ) నుంచి సస్పెన్షన్‌కు గురైన తర్వాత కవిత తన రాజకీయ పంథాను పూర్తిగా మార్చుకున్నారు. కేవలం తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని తెలుసుకునేందుకు జాగృతి జనంబాట పేరుతో పర్యటనలు చేపట్టారు. కేవలం భావోద్వేగాల మీద కాకుండా, ప్రజా సమస్యల ప్రాతిపదికన పార్టీ విధానాలు ఉండాలని ఆమె భావిస్తున్నారు. వివిధ సామాజిక వర్గాల సమస్యలు, ఆర్థిక స్థితిగతులు, రైతాంగ ఇబ్బందులపై అధ్యయనం చేయడానికి 50 కమిటీలను ఏర్పాటు చేశారు. మేధావులు, విద్యార్థులు, కుల వృత్తుల వారితో సమావేశమై పార్టీ ఎజెండా రూపకల్పనలో వారి భాగస్వామ్యాన్ని తీసుకుంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వారు, అమరవీరుల కుటుంబాలు 'జాగృతి' నీడలోకి రావాలని ఆమె బహిరంగంగానే విజ్ఞప్తి చేశారు.ఈ కొత్త పార్టీ రూపకల్పన వెనుక ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ టీం పని చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. సోషల్ మీడియా మేనేజ్‌మెంట్ నుండి క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నిర్మాణ వరకు పీకే సలహాలను కవిత తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాబోయే జీహెచ్ఎంసీ ( ఎన్నికలే ఈ పార్టీకి మొదటి పరీక్ష కానున్నాయి. ఒకవేళ ఈసీఐ నుంచి గుర్తింపు సకాలంలో వస్తే, హైదరాబాద్ నగర వ్యాప్తంగా అభ్యర్థులను నిలబెట్టి తన సత్తా చాటాలని కవిత యోచిస్తున్నారు. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రధాన రాజకీయ శక్తిగా ఎదగాలన్నది ఆమె మాస్టర్ ప్లాన్. "నా రాజకీయ భవిష్యత్తు కోసం పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకున్నాను. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు ఈ పార్టీ నాంది పలుకుతుంది" అని కవిత ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'సామాజిక తెలంగాణ' నినాదంతో, అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ ఎజెండా ఉండబోతున్నట్లు సమాచారం. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ప్రకటించనున్నారు. అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య 'జాగృతి' ఏ మేరకు ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.


# పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు.

**దశ, హైదరాబాద్:** ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి పేద రోగులకు ఆశాకిరణంగా మారింది. ఆరోగ్యశ్రీ పథకం కింద ఇక్కడ ఉచిత రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తూ అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. గత 30 నెలల వ్యవధిలో సుమారు రూ.12.5 కోట్ల విలువైన 250 రోబోటిక్ సర్జరీలను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక్కో రోబో సర్జరీకి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుండగా, ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం ఒక్కో శస్త్రచికిత్సకు సుమారు రూ.1.5 లక్షలు చెల్లిస్తోంది. చేతిలో డబ్బు లేక ఇబ్బంది పడే అనేక మంది రోగులకు ఇది నిజంగా వరంగా నిలుస్తోంది.

అత్యాధునిక సర్జికల్ రోబో సాంకేతికతతో అతి చిన్న క్యాన్సర్ కణతులను కూడా కోతలు లేకుండా, కేవలం చిన్న రంధ్రాల ద్వారా ఖచ్చితంగా తొలగించడం సాధ్యమవుతోంది. దీంతో రక్తస్రావం తక్కువగా ఉండటమే కాకుండా, ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం కూడా గణనీయంగా తగ్గుతోంది. శస్త్రచికిత్స తర్వాత కోలుకునే సమయం తగ్గడం వల్ల రోగులు త్వరగా సాధారణ జీవితానికి చేరుకుంటున్నారు. కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భాశయ, అన్నవాహిక, ప్రొస్టేట్ వంటి క్యాన్సర్ల చికిత్సలో ఈ విధానం మెరుగైన ఫలితాలు ఇస్తోందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా మహిళల్లో కనిపించే గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో రోబోటిక్ సర్జరీ మంచి ప్రయోజనం అందిస్తోంది.

హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి కూడా ప్రతి రోజూ 700-800 మంది రోగులు చికిత్స కోసం ఎంఎన్‌జే ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. పరిమిత వనరుల మధ్య కూడా వైద్యులు సమర్థవంతంగా సేవలు అందిస్తూ రోగులకు నూతన ఆశను నూరిపోస్తున్నారు.


# మూడు భాగాలుగా జీహెచ్ఎంసి.




**దశ, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ ని జీహెచ్ఎంసీ, సైబరాబాద్(సీఎంసీ), మల్కాజ్గిరి(ఎంఎంసీ)లను మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన కార్పొరేషన్లకు నూతన కమీషనర్లను నియమించింది. జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిషనర్గా ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్గా శ్రీజన, మల్కాజ్గిరి కార్పొరేషన్ కమిషనర్గా వినయ్ కృష్ణా రెడ్డి ని నియమించారు. సీఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, పటాన్చెరు, కూకట్పల్లి(పాక్షికంగా), మేడ్చల్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు జీహెచ్ఎంసీ పరిధిలో ముషీరాబాద్, మలక్పేట్, అంబర్పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్పురా, బహదూర్పురా, సికింద్రాబాద్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు ఎంఎంసీ పరిధిలో మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మేడ్చల్, కూకట్పల్లి(పాక్షికంగా), ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు వస్తాయి.

# ఉద్యమకారుల త్యాగాలను కించపరచవద్దు

## కప్పాటి పాండురంగా రెడ్డి



**దశ, రంగారెడ్డి:** స్వరాష్ట్ర సాధన కోసం పద్నాలుగేళ్ల పాటు సాగిన ఉజ్వల పోరాటంలో తమ జీవితాలను ధారపోసిన తెలంగాణ ఉద్యమకారుల పట్ల గౌరవనీయ హైకోర్టు చేసినట్లుగా వస్తున్న వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు వేలాది మంది ఉద్యమకారుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటానికి సమానమైన ఉద్యమం తెలంగాణ ఉద్యమం ,"ఇంటి స్థలం, పింఛను ఇవ్వడానికి మీరేమైనా స్వాతంత్ర్య సమరయోధులా?" అని న్యాయస్థానం ప్రశ్నించడం ఉద్యమకారుల త్యాగాలను తక్కువ చేసి చూపడమే. 1969 నుండి 2014 వరకు సాగిన పోరాటం ఆధిపత్య పరాయి పాలన నుండి విముక్తి కోసం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటం. తెలంగాణ ఉద్యమకారులను కేవలం "లబ్ధిదారులు"గా చూడటం మానుకోవాలని, వారు ఈ రాష్ట్ర నిర్మాతలని గుర్తు చేశారు. కోర్టులు చట్టాలను గౌరవించడమే కాకుండా, ప్రజల సెంటిమెంట్లను మరియు చారిత్రక నేపథ్యాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయని, తెలంగాణ సమాజం వీటిని సమర్థించదని ఆయన స్పష్టం చేశారు. న్యాయస్థానాలు, న్యాయమూర్తులు మరియు న్యాయవాదులు ఉద్యమకారులకు అండగా నిలవాలని ఆయన కోరారు.





# 'వాలెంటైన్స్ డే' ను నిషేధించాలి: లక్ష్మణ్ రావు

**దశ, హైదరాబాద్:** ఫిబ్రవరి 14న నిర్వహించే 'వాలెంటైన్స్ డే' ను నిషేధించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో వాలెంటైన్ డే ను నిషేధించాలని పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. వాలెంటైన్స్ డే వేడుక యువతలో తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చురుకుగా పర్యవేక్షించాలని, వాలెంటైన్స్ డే జరుపుకోవడం వల్ల కలిగే సాంస్కృతిక చిక్కుల గురించి వారికి అవగాహన కల్పించాలని కోరారు, ఇది భారతీయ విలువలలో పాతుకుపోయిన పాశ్చాత్య సంప్రదాయం కాదని ఆయన అభివర్ణించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం, ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. పబ్బులు, హోటళ్ళు, మాల్స్, రిసార్ట్‌లు, ఇతర వ్యాపార సంస్థలు వాలెంటైన్స్ డేను వాణిజ్యీకరించడం పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో భజరంగ్ సేన ఉపాధ్యక్షుడు (తెలంగాణ) ప్రభు బిరాదార్, జాయింట్ సెక్రటరీ శ్రీమతి ఆర్తి మహేంద్రకర్, మనోజ్ మొగల్గిడ్డి, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, అజయ్ నాయుడు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# టీ20 మజా ఆయా.. మ్యాచ్ టై, సూపర్ ఓవర్

ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో సౌతాఫ్రికా అఫ్ఘనిస్తాన్ మ్యాచ్ నువ్వా నేనా అన్నట్టు సాగింది. ఆఖరి వరకూ టెన్షన్ పుట్టించిన ఈ మ్యాచ్‌లో అఫ్ఘనిస్తాన్ విజయం సాధించింది. అంతా అయిపోయింది అనుకున్న సమయంలో నూర్ అహ్మద్ సిక్సర్లతో అఫ్ఘనిస్తాన్‌కు విజయాన్ని అందించాడు. లాస్ట్ ఓవర్ మొదటి బంతికే అవుటైనా అది నో బాల్ కావడంతో మ్యాచ్ ఒక్కసారిగా మలుపు తిరిగింది. అదే ఓవర్‌లో రబాడా మరో నో బాల్ వేయడం, ఆ వెంటనే రనౌట్ అవడంతో మ్యాచ్ టైగా ముగిసింది. దాంతో సూపర్ ఓవర్ తప్పలేదు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా అఫ్ఘనిస్తాన్ పోటాపోటీగా ఆడారు. టాస్ గెలిచిన అఫ్ఘనిస్తాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ బౌలింగ్ ఎంచుకుని సౌతాఫ్రికాను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు.

కెప్టెన్ ఎయిడెన్ మర్కరమ్ కేవలం ఐదు పరుగులకే పెవిలియన్ బాట పట్టినా.. క్వింటన్ డికాక్ ర్యాన్ రికెల్టన్ జట్టు బాధ్యతలను తమ భుజాలపై వేసుకున్నారు. క్వింటన్ డికాక్ ర్యాన్ రికెల్టన్ ఇద్దరూ కలిసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. 61 బంతుల్లోనే 114 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే ఇద్దరూ హాఫ్ సెంచరీలు కూడా పూర్తి చేసుకున్నారు.



సఫారీల స్కోర్ ఈజీగా 200 దాటుతుందని అనుకున్న సమయంలో 28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 61 పరుగులు చేసిన ర్యాన్ రికెల్టన్, 41 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 పరుగులు చేసిన డికాక్ వెంటవెంటనే అవుటయ్యారు.

డివాల్డ్ బ్రెవీస్ 23, డేవిడ్ మిల్లర్ 20 పరుగులు చేసినా ఆఖర్లో భారీగా పరుగులు రాబట్టలేకపోయారు. ఆఖర్లో మార్కో యాన్సన్ 7 బంతుల్లో 16 పరుగులు చేసి సౌతాఫ్రికా స్కోర్‌ను 180 దాటించగలిగాడు. అఫ్ఘనిస్తాన్ బౌలర్లు కూడా పట్టు సాధించడంతో సౌతాఫ్రికా జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. సౌతాఫ్రికా ఇచ్చిన 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్ఘనిస్తాన్ జట్టు పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయింది. గుల్బదీన్ నాయబ్, సెడీకుల్లా అటల్ డకౌట్లు కావడంతో 52 పరుగులకే అఫ్ఘన్ మూడు వికెట్లు కోల్పోయింది. సరిగ్గా ఆ సమయంలోనే ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ విధ్వంసం సృష్టించాడు. సఫారీ బౌలర్లు ఊచకోత కోశాడు. 42 బంతుల్లోనే 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 84 పరుగులు చేసి కేశవ్ మహారాజ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్ 17 బంతుల్లో 22, రషీద్ ఖాన్ 12 బంతుల్లో 20 పరుగులు చేసి ఆఖర్లో పోరాడారు. ఆఖర్లో నూర్ అహ్మద్ సిక్సర్ 9 బంతుల్లో 2 సిక్సర్లతో 15 పరుగులు చేయడం.. ఆఖరి ఓవర్‌లో రెండు నో బాల్ రావడంతో మ్యాచ్ అఫ్ఘన్ వైపు తిరిగింది. కానీ ఆఖర్లో ఫరూఖీ రనౌట్ కావడంతో మ్యాచ్ టైగా ముగిసింది. 19.4 ఓవర్లకు అఫ్ఘనిస్తాన్ 187 పరుగులకు ఆలౌట్ అయింది.

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్లో ప్రశాంతంగా మున్సిపల్ పోలింగ్



**దశ,గజ్వేల్:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పోలింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. మున్సిపాలిటీలోని 20 వార్డులకు గాను సాయంత్రం 5 గంటల వరకు 79.35 శాతం పోలింగ్ నమోదు అయింది. మొత్తం 46,740 మంది ఓటర్లలో 37,088 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 18,985 మంది పురుషులు, 18,102 మంది మహిళలు, ఒకరు ఇతర లింగానికి చెందిన ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో కొనసాగింది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి 13వ వార్డులోని 46వ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హైమావతి మరియు మున్సిపల్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ పలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అధికారులు పోలింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలను సమీక్షించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com